## ఆగస్టులో కంటోన్మెంట్ ఎన్నికలు?




హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలక మండలికి ఆగస్టులో ఎన్నికలు జరగవచ్చంటూ ఊహాగానాలు వెలువడుతున్నాయి. కంటోన్మెంట్ చట్ట సవరణ బిల్లు పార్లమెంట్ వేసవి కాల సమావేశాల్లో అమోదం పొందడం ఖాయమని, కొత్త చట్టం ప్రకారం పార్టీల ఆధారంగా, గుర్తింపు పొందిన చిహ్నాలతో బోర్డు ఎన్నికలు జరుగుతాయంటూ విస్తృతంగా ప్రచారం ప్రారంభమైంది. కొత్త చట్టం అమలులోకి రాకపోయినా పాత చట్టం ప్రకారమే పార్టీలకు అతీతంగా దేశంలోని అన్ని కంటోన్మెంట్లకు ఎన్నికలు జరపాలని రక్షణ శాఖ నిర్ణయించినట్లు సోషల్ మీడియాలతో వైరల్ అయింది. దేశవ్యాప్తంగా కంటోన్మెంట్లకు ఏప్రిల్ 30న ఎన్నికలు జరపాలని షెడ్యూల్ విడుదల చేసిన రక్షణ శాఖ ఆ తర్వాత యూటర్న్ తీసుకొని.. ఎన్నికలు వాయిదా వేస్తూ గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కంటోన్మెంట్ల ఎన్నికలు సత్వరమే నిర్వహించాలని కొద్ది నెలల క్రితమే కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా..తాజాగా మరి కొందరు కోర్టుకు వెళ్లనుండడంతో ఎన్నికల నిర్వహణపై రక్షణ శాఖ మరోసారి దృష్టి సారించినట్లు చెబుతున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు దీనిపై అధికారికంగా స్పందించడం లేదు. రక్షణ శాఖ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటుందో చెప్పలేమని, కంటోన్మెంట్ చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందినా, పొందకపోయినా రక్షణ శాఖ తలచుకుంటే ఎన్నికలు ఏ క్షణంలోనైనా నిర్వహించవచ్చంటూ అనధికారికంగా వ్యాఖ్యానించారు.



# హైదరాబాద్ వార్త

# పర్మిషన్ ఇచ్చి.. పట్టించుకోరు

**తనిఖీ లేకుండానే విద్యుత్ కనెక్షన్లకు అనుమతులు**

**అడ్డగోలు వైరింగ్‌తో షాట్‌సర్క్యూట్స్**

**ప్రమాదాలు జరిగినపుడే హడావిడి చేస్తున్న అధికారులు**



హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త: కేవలం "విద్యుత్ కనెక్షన్లు ఇస్తాం..ప్రతినెలా బిల్లులు తీసుకుంటాం" మిగతా విషయాలు మాకు సంబంధం లేదన్న చందంగా మారింది విద్యుత్ అధికారుల పరిస్థితి. ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి చేయడం..అక్కడ నామమాత్రపు మరమ్మత్తులు చేపట్టి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. ప్రతి సంవత్సరం లోడ్ చెక్ చేయాల్సిన లైన్ ఇన్‌స్పెక్టర్లు తమ కేమీ పట్టనట్లుగా వ్యవహిస్తునండటంతో నిత్యం ఏదోఒకచోట ప్రమాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ఆయా భవనాల్లో నిర్మాణ సమయంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆమేరకు సామర్థ్యం గల కేబుళ్లను ఎంపిక చేయకపోవడం, ఒకేపిన్ నుంచి మూడు నాలుగు ఎలక్రానిక్ వస్తువులకు కనెక్షన్లు ఇస్తుండటం వల్ల కేబుళ్ల అధిక ఒత్తిడికి లోనై షార్ట్ సర్క్యూట్‌కు కారణమవుతున్నట్లు తెలుస్తుంది.

**తనిఖీలు నామమాత్రమే..** గ్రేటర్‌లోని పలుభవనాల్లో 10ఏళ్ల క్రితం అప్పటిలోడ్‌కు అనుగుణంగా వేసిన విద్యుత్ తీగలనే ఇప్పటికీ వినియోగిస్తున్నారు. విద్యుత్ తీగలు పాడైపోవడం తోపాటు అదనపులోడ్‌పడి తీగలు కాలిపోయే అవకాశాలున్నా.. విద్యుత్‌శాఖ వాటిని పట్టించుకోవడం లేదు. నగరంలో జరిగే ప్రమాదాల్లో ఎక్కువగా లోడ్ పెరిగి షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదాలు జరిగేందుకు కారణంగా నిలుస్తున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు పేర్కొంటున్నారు. వ్యాపారం వాణిజ్య సంస్థల్లో ఇష్టానుసారంగా వైరింగ్ చేస్తున్నా.. దాన్ని నియంత్రించాల్సి అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. భవనాల్లో లెక్కకు మించి ఏసీలు,సర్వర్లు వినియోగితిస్తూ విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతున్నా.. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కొత్తగా వందల సంఖ్యలో నిర్మిస్తున్న బహుళ అంతస్తులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల్లో వైరింగ్‌పై ఎలాంటి తనిఖీలు చేయకుండానే సర్టిఫికేట్లు జారీ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏటా నగరంలో జరిగే విద్యుత్ ప్రమాదాల్లో 30శాతం ప్రమాదాలు షార్ట్ సర్క్యూట్ కారణంగానే జరుగుతున్నాయి. 50ఫీట్లకు పైగా బహుళ అంతస్తులు, కొత్తగా ఏర్పాటు చేస్తున్న కంపెనీలకు హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు సీఈఐసీ అప్రూవల్ సర్టిఫికేట్ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఇతర కనెక్షన్లకు విద్యుత్‌శాఖ అధికారులే తనిఖీలు చేసి కనెక్షన్లు మంజూరు చేస్తుంటారు. ఈరెండింటా అడిగినంత చెల్లిస్తే తనిఖీలు చేయకుండానే విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తుంటారనే ఆరోపణలు ఉన్నాయి.

**పర్మిషన్ ఇలా..** విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలకు హెచ్‌టి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే ముందు విద్యుత్ తనిఖీశాఖ (సీఈఐజీ) నుంచి సర్టిఫికేట్ తీసుకోవాల్సి ఉంటుంది. సర్టిఫికేట్‌తోపాటు ఎంతలోడ్ వినియోగిస్తారో తెలుపుతూ విద్యుత్‌శాఖకు దరఖాస్తు చేసుకుంటే డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు తనిఖీ చేయడంతో పాటు ఎస్టిమేషన్ రూపొందిస్తారు. ఈఎస్టిమేషన్ ఆధారంగా విద్యుత్‌శాఖకు డీడీరూపంలో మొత్తాన్ని చెల్లిస్తారు. తర్వాత అధికారులు మరో తనిఖీ చేసి విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తారు. విద్యుత్ సరఫరా నిర్వాహణకోసం 10శాతం ఛార్జీలను వినియోగదారులనుంచి విద్యుత్‌శాఖ వసూలు చేస్తుంది. దీన్ని వసూలు చూస్తున్నందుకు విద్యుత్ తీగల పనితీరు పరిశీలిస్తూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

## కుక్కల దాడిలో 10ఏళ్ల బాలికకు తీవ్ర గాయాలు



జీడిమెట్ల, మార్చి 31 ప్రభాతవార్త: గ్రామాలు, నగరాలలో వీధి కుక్కల దాడి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. తాజాగా కుత్బుల్లాపూర్ డివిజన్ గాజులరామారం డివిజన్ చెన్నకేశవ నగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న 10ఏళ్ళ బాలిక అన్వితపై వీధి కుక్కలు దాడి చేశా యి. ఈ దాడిలో గాయప డిన అన్విత గట్టిగా కేకలు వేయడంతో అప్రమ త్తమైన స్థానికులు బాలికను కుక్కల దాడి నుంచి రక్షించడంతో తృటిలో ప్రాణాపాయం నుం చి బయటపడింది. అయితే కుక్కల దాడిలో అన్విత కుడి తొడకు తీవ్ర గాయాలడంతో చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. తమ వీధిలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు, బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన వీధి కుక్కల బెడద నుంచి ప్రజల ను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## నేటి నుంచి రద్దీ వేళల్లో మెట్రో రాయితీ రద్దు



హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త : నగరవాసులకు మెట్రో రాయితీల్లో కోత విధించింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మెట్రో రైలు ప్రయాణ రాయితీల్లో కోత విధించనున్నారు. ఇప్పటి వరకు ఇస్తున్న డిస్కౌంట్‌ను రద్దీ వేళల్లో ఎత్తివేస్తున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. రద్దీ వేళల్లో డిస్కౌంట్‌ను పూర్తిగా ఎత్తివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 8గంటల వరకూ..రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకూ మాత్రమే రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ఇప్పటి వరకు ప్రయాణ ఛార్జీల్లో 10 శాతం డిస్కౌంట్ ఉండేది. అదే విధంగా సూపర్ సేవర్ హాలీడే కార్డు చార్జీని భారీగా పెంచనున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. సెలవు రోజుల్లో ప్రయాణించే హాలిడే కార్డు రూ.59గా ఉన్న ధరను రూ.99 పెంచనున్నారు. గతంలో రూ.59లతో కార్డు తీసుకున్న వారు సూపర్ సేవర్ రూ.99 రీఛార్జ్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. కాని కొత్తగా తీసుకునే వారు మాత్రం రూ.100 చెల్లించాలని చెప్పారు. అలాగే కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డుల ధరను భారీగా పెంచనున్నారు.

## రాహుల్ సభ్యత్వం రద్దు చేయడం సరైంది కాదు

**టీపిసిసి ప్రధాన కార్యదర్శి ఫెరోజ్ ఖాన్**



సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద సత్యగ్రహ దీక్షలో ప్రసంగిస్తున్న ఫెరోజ్ ఖాన్ తదితరులు

కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కక్ష్య న సాధింపు చర్యలతో రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం సమంజసం కాదని టీపిసిసి ప్రధాన కార్యదర్శి ఫెరోజ్ ఖాన్, ఎన్.విఠల్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, కంటోన్మెంట్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బొల్లు కిషన్, డి.బి.దేవేందర్ (వేదులు) మండిపడ్డారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వ నమోదుకు నిరసనగా శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద నిర్వహించిన సత్యగ్రహ దీక్షకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. బిజెపి ప్రజా సస్వామ్యంతో చెలగాటం అడుతుందన్నారు. దేశంలో రాహుల్ గాంధీ తలపెట్టిన భారత్ జోడో యాత్రకు అన్ని వర్గాల ప్రజల నుండి వచ్చిన అధరనను జీర్ణించుకోలేక రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారన్నారు. అదే విధంగా రెండు యేండ్ల శిక్ష విధించి చట్ట ప్రకారం అనర్హత ప్రకటించడం దారుణమన్నారు. రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దుకు ప్రజి సస్వామ్యానికి తీరని మచ్చ ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు శ్యామల, కిరణ్ కుమార్ రెడ్డి, గ్రేటర్ మహిళా అధ్యక్షురాలు కవిత, ఎసస్సీ సెల్ అధ్యక్షుడు అచ్చుత రమేశ్, కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు ఎస్.వెంకటేశ్, బల్వంత్ రెడ్డి, గజ్వెల్ భరత్, డి.బాబురావ్, వరదా రాణి తదితరులు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా కూలిన రెండంతస్తుల మేడ

- ➢ కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో ఘటన
- ➢ చుట్టుపక్కల మూడిళ్లకు పగుళ్లు
- ➢ పాత ఇంటిని మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం
- ➢ తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడిన వైనం



కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో రెండస్తుల భవనం కూలి శిధిలాలతో నేలమట్టమైన దృశ్యం, పోలీసులతో స్థానికులు



కుత్బుల్లాపూర్, మార్చి 31 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో ఒక పాతఇంటికి మరమ్మత్తులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా రెండస్తులమేడ కూలిపోయి భారీ ప్రమాదం చోటు చేసుకుంది. కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో ఎం.శివకుమార్ అనేవ్యక్తి ఇటీవల కొనుగోలుచేసి ఇంటిమరమ్మత్తుల కోసం కిటికీలు, గుమ్మాలను మార్చేందుకు మరమ్మత్తులు చేస్తున్నారు. పాత ఇళ్లుకావటంతో తలుపులు, గుమ్మాలు పూర్తిగాచెడిపోయి తడిసి వున్నాయి. వాటిని మార్చేక్రమంలో గత ఐదురోజులుగా మరమ్మత్తులు చేస్తుండగా బీటలువారిన గోడలు ఊగటంగమనించిన నిర్మాణ కార్మికులు హుటాహుటిన బయటకు పరుగులు తీశారు. కార్మికులు వెళ్లిన కొద్ది నిమిషాల వెంటనే అంతకుముందే బీటలువారిన గోడలు ఒక్కసారిగా కుప్పకూలి క్రిందపడ్డాయి. ఈశబ్దాలతో చుట్టుపక్కల గల మూడు ఇళ్లు పగుళ్లకు లోనయ్యాయి. రెండస్తుల భవనం కూలిపోవడంలో శిధిలాలు పక్కనగల ఆపార్ట్‌మెంట్ ప్రాహారీగోడపై పడి బోర్‌మోటరు సైతం శిధిలాలలో మునిగిపోయింది. ఇదేసమయంలో వెనక ఇంట్లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులకు శిధిలాలు మీదపడి గాయాల పాలవటంతో సోనాబాయ్, మరో గుర్తుతెలియని వ్యక్తులను ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి చుట్టుపక్కలవారికి ధైర్యం చెప్పారు. శుక్రవారం సంఘటన స్థలానిని చేరుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారి వికాస్, ప్రభావతిలు పరిస్థితిని స్థానికుల నుండి వివరాలను అడిగితెలుకుని ఎలాంటి అనుమతిలేకుండా నిర్మాణ పనులను చేపట్టిన ఇంటి యజమాని శివకుమార్‌పై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతి లేకుండా నిర్మాణ కార్యక్రమాలను చేపడితే కఠినచర్యలు తప్పవని కుత్బుల్లాపూర్ డివిజన్ టౌన్‌ప్లానింగ్ అధికారి వికాస్ హెచ్చరించారు.

## హిందూ ఐక్యత కోసమే బజరంగ్‌దళ్ ర్యాలీలు

**విశ్వహిందూ పరిషత్**



ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విహెచ్‌పి, భజరంగ్‌దళ్ నేతలు

హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త: సమస్త హిందూ యువకుల ఐక్యకోసమే భజరంగ్‌దళ్ నిర్విరామంగా కృషి చేస్తుందని విశ్వహిందూ పరిషత్ పేర్కొంది. యువతలో దైవభక్తి నింపి ధర్మవీరులను తయారు చేస్తోందని చెప్పింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, విహెచ్‌పి ప్రచార ప్రముఖ్ పగుడాలకుల బాలస్వామి ,ధర్మ ప్రసార్ రాష్ట్ర సహ ప్రముఖ్ లు ఏప్రిల్ ఆరవ తేదీన నిర్వహించే "వీర హనుమాన్ విజయ యాత్ర - హిందూశక్తి ప్రదర్శన "కు సంబంధించిన గోడపత్రిను విడుదల చేశారు. ఈసందర్భం గా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 9600ప్రాంతాల్లో బజరం గ్‌దళ్ కార్యకర్తలు హనుమాన్ జయంతి నిర్వహిస్తారని చెప్పారు. భాగ్యనగర్‌లో దాదాపు 3లక్షలమందితో భారీ ర్యాలీ కొనసాగుతుందన్నారు. గౌలిగూడ రామ్ మందిర్లఓ పూజలు నిర్వహించి మహా ర్యాలీని ప్రారంభిస్తామని సికింద్రాబాద్ తాడ్‌బాండ్ హనుమాన్ దేశాలయానికి చేరుకుని యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈసమావేశంలో కమల్ వీరేష్, మహేష్‌యాదవ్, అఖిల్, బిరాదర్ రాము, భరత్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అరెస్టు చేయడం కాదు..

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బోర్డు మెంబర్లను అరెస్టు చేయాలి

**బహుజన విద్యార్థి సంఘాలు**



ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట నినాదాలు చేస్తున్న బహుజన విద్యార్థి సంఘాలు

తార్నాక, మార్చి 31 ప్రభాతవార్త: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలపై నిరసన వ్యక్తం చేస్తున్న ఓ.యూ విద్యార్థులను, కేయూ విద్యార్థులను అరెస్టు చేస్తున్నారని ఇది దుర్మార్గమైన చర్య అని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, బహుజన్ స్టూడెంట్స్ జాక్ చైర్మన్ వేల్పుల సంజయ్, ఓ.యూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో అరెస్టులకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిట్ అధికారులు లీకేజీ వ్యవహారాన్ని త్వరితగతిన తేల్చి పరీక్షలు రాసిన వారికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు భాద్యులపై చర్యలు తీసుకోకపోవడం విడ్డురంగా ఉందన్నారు. ఈ కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు పోమల అంబేద్కర్, మొర్రప్రభాకర్, ప్రశాంత్, వెంకన్న గౌడ్, రాజు, యుగెందర్, ప్రవీణ్, సతీష్, వెంకటేష్, భాస్కర్, శ్రీనివాస్, సత్యం, ఆనంద్, కుమార్, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

## డోజర్ డ్రైవర్ అజాగ్రత్తకు ఏడాదిన్నర చిన్నారి బలి



నార్సింగి, మార్చి 31 ప్రభాతవార్త : డోజర్ డ్రైవర్ అజాగ్రత్త డ్రైవింగ్‌కు ఏడాదిన్నర వయసున్న బాలిక బలైంది. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన శ్రీరామ్ సాహూ తన భార్య, బిడ్డలతో కలిసి నగరానికి వలస వచ్చి, గండిపేట మండలం కోకాపేట్ వద్ద ఉన్న ఓ లేబర్ క్యాంప్‌లో ఉంటూ లేబర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం శ్రీరామ్ భార్య నీలంభాయి తన ఏడాద్నిర కూతురుతో కలిసి పని చేసేందుకు వెళ్లింది. కూతురును ఓ సైడ్‌లో పడుకోబెట్టి డోజర్ (టిఎస్ 07 యుహెచ్ 3337) వద్ద పని చేస్తుంది. డోజర్ డ్రైవర్ వేగంగా వెనిక్కి తోలడంతో ఏడాదిన్నర బాలిక ఛాతిపైకి వెనుక టైర్ వెళ్లింది. తీవ్రంగా గాయాలపాలైన బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కనుల విందుగా రామయ్య పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల మంతోచ్ఛారణల మధ్య శ్రీ సీతా రామచంద్రమూర్తి సామ్రాజ్య పట్టా భిషేకం మహోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. వేదపండితులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, కందాళ వెంకటాద్రి, పురుషోత్తమ చారి, ఎస్‌బివి ఎన్. ఆచార్యులు వేదఘోష మధ్య సాగింది. ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ జి.మురళీప్రసాద్, ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు కనులారా వీక్షించారు. ముందుగా ప్రత్యేక ఆసనంపై వేంచేపు చేసిన అర్చక స్వాములు సామూహిక పారాయణాలు, హోమాలు నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం స్వామివారికి అలంకరణలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దసంఖ్యలోఈ కార్యక్రమాన్ని తిలకించడానికి హాజరయ్యారు. అనంతరం స్వామివారి ఊరేగింపు జరిగింది.

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లక్ష్మీగణపతి ఆలయంలో**

పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీ కోదండరామాలయంలో వైభవోపేతంగా స్వామివారి పట్టాభిషేక మహోత్సవం కన్నులపండువగా సాగింది. ఉదయం స్వామివారికి వెండి కవచ ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. కాగా స్వామివారి రథోత్సవ ఊరేగింపు కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్‌నిర్మాణ కమిటీ చైర్మన్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఈవో లక్ష్మారెడ్డి, ఆలయం ప్రధాన అర్చకులు కాశీనాథ్‌శర్మ, జగన్మోహనాచార్యులు, గోపాలాచార్యులు, రామాచారి, రాజన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఆలయం నుంచి ప్రారంభమై చిక్కడపల్లి, ఆర్టీసిక్రాస్‌రోడ్స్ మీదుగా సాగింది. అడుగడుగునా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామివారి పట్టాభిషేకం చూసిన, విన్న వారికి సుఖ, సంతోషాలు కలుగుతాయని అన్నారు.



## భాగ్యలక్ష్మి మందిరంలో పూజలు నిర్వహించిన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

చార్మినార్, మార్చి 31 ప్రభాతవార్త : శ్రీ రామ నవమి వేడుకలు సందర్భంగా కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం రాత్రి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి మందిరాన్ని సందర్శించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మందిరం కమిటి ప్రతినిధి శశికళ కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌జి జల మండలిలో ప్రపంచ మంచినీటి దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి అధికారులు, ఉద్యోగులు

చార్మినార్, మార్చి 31 ప్రభాతవార్త : పాతబస్తీ చందూలాల్ బారాదరిలోని ఎంఆర్‌జిలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మంచి నీటి పొదుపు నీటి సంరక్షణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డిజిఎం మహ్మద్ అబ్దుల్ హాకీం, మేనేజర్ ఈశ్వరయ్య, మమత ఎడ్యుకేషనల్ సోసైటీ ప్రతినిధులు కె.సుభాష్ చంద్ర, ఎ.శివకుమార్, జల మండలి ఉద్యోగులు గణేష్, యాదయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి ప్రజ్ఞా జైస్వాల్

## ఉద్యోగం పోతుందని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య



నార్సింగి, మార్చి 31 ప్రభాతవార్త : ఉద్యోగం పోతుందని మనస్థాపానికి గురైన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు ప్రాంతానికి చెందిన చందోలు సాంభ శివరావ్ కుమారుడు చందోలు వినోద్ కుమార్(32) హైదరాబాద్ నగర శివారుల్లోని మాదాపూర్‌లోని ఓ కంపనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ గ్రామం అల్కాపురి కాలనీలో నివసిస్తున్నాడు. ఇటీవల ఇతడు తన ఉద్యోగం పోతుందేమోనని ఆందోళన చెందుతూ, కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద బాధ పడుతున్నాడు. మార్చి 30వ తేదీన మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో అల్కాపురి కాలనీలో ఇంటికి వచ్చి బెడ్‌షిట్‌తో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కొంత సమయం తరువాత గమనించిన మృతుడి సోదరుడు రాజేష్ సూపర్‌వైజర్ భానుచందర్‌తో కలిసి కిందకి దించారు. అంకిత్ మిశ్రా అనే వైద్యుడు సిపిఆర్ చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయాన్ని నార్సింగి పోలీసులకు తెలుపడంతో వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సెల్‌ఫోన్, కన్ను, మనోనేత్రంను నియంత్రణలో ఉంచుకోవాలి

**హైదరాబాద్ ఆకాశవాణి కేంద్ర సంచాలకులు వి.ఉదయ్‌శంకర్**


పురస్కారాలు ప్రదానం చేసిన దృశ్యం

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: సెల్‌ఫోన్, కన్ను, మనోనేత్రం వీటిని ప్రతివారూ నియంత్రణలో ఉంచుకోవాలని, ముఖ్యంగా వార్ధక్యం అధిగమించేందుకు కళలు మాత్రమే దోహదం చేస్తాయని హైదరాబాద్ ఆకాశవాణి కేంద్ర సంచాలకులు వి.ఉదయ్‌శంకర్ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బా రావు కళావేదికలో జ్యోత్స్నకళాపీఠం, సంస్కారభారతి సంయుక్త ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది సందర్భంగా వివిధ సాహితీప్రక్రియలలోని ప్రముఖులకు ఉగాది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత్రి ప్రొఫెసర్ డాక్టర్ శరత్‌జ్యోత్స్నారాణి ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య టి.గౌరీశంకర్ అధ్యక్షతన సదస్సు జరిగింది. పద్యకవిత్వంలో ఏ.వరలక్ష్మి, వరచకవిత్వంలో స్వాతి, కథాప్రక్రియలో శాంతికుమారి, సాహితీవిమర్శలో డాక్టర్ జయరాములు, సాహిత్య వ్యాసాలులో పి.భారతి, అనువాద ప్రక్రియలో భుజంగరెడ్డి, సంస్కృతిక రంగంలో రవణి రమేశ్‌కు అందించిన అనంతరం ఉదయ్‌శంకర్ మాట్లాడుతూ వయస్సుపైబడిన వారు తమ సహచరులతో కలిసి ఏదో ఒక కళా లేదా సాహితీ ప్రక్రియలో తరచు కలిసి ఆస్వాదించడం లేదా అభ్యసించడం అలవర్చుకోవాలని అన్నారు.

## వర్గల్ విద్యా సరస్వతి దేవాలయానికి కేంద్ర భోగ్ సర్టిఫికెట్


వర్గల్ శ్రీవిద్యాసరస్వతి శనైశ్చర ఆలయం వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతిని సత్కరిస్తున్న భక్తులు

బేగంపేట మార్చి 31,ప్రభాతవార్త : అక్షరాలు నేర్పించే అమ్మ విద్యా సరస్వతి పుట్టిన ప్రతి చిన్నారికి విద్యాబుద్ధులు నేర్పించాలంటే అమ్మ అనుగ్రహం తప్పని సరిగా భావించే భక్తులు ఇష్ట దైవంగా కొలిచే వర్గల్ శ్రీ విద్యా సరస్వతి శనైశ్చర ఆలయానికి కేంద్ర ప్రభుత్వం అందించే భోగ్,సర్టిఫికెట్ రావడంపై తెలంగాణా ప్రజలతో పాటు రాజకీయ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా శుక్రవారం రాంగోపాల్‌పేట డివిజన్ శ్రీ కొత్త ఎల్లయ్య మెమోరియల్ హైస్కూలు సోమసుందరం వీధి లో పలువురు భక్తులు,రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ని ఘనంగా సత్కరించి,సన్మానించారు.ఈ సందర్భంగా యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి మాట్లాడుతూ వర్గల్ అమ్మ వారి ఆలయానికి కేంద్ర ప్రభుత్వ ,భోగ్, గుర్తింపు రావడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు.ఇదంతా తన సహచర సభ్యులు,భక్తుల ప్రోత్సాహమేనని ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ఆలయాలలో యాదాద్రితో పాటు వర్గల్ ఆలయం కూడా ఉండటం అమ్మ వారి కరుణా కటాక్షాలేనన్నారు.మొత్త ౦70 దరఖాస్తులలో శ్రీవిద్యా సరస్వతి శనైశ్చర ఆలయం,యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలకు భోగ్ గుర్తింపు రావడం ఎంతో శుభపరిణామమని ఆయన తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో దేవాదాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.దుర్గా ప్రసాదరావు, భాజపా నాయకులు వజనాల దయానందరావు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవం



ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, మార్చి 31 ప్రభాతవార్త: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి క్యాంపు కార్యాలయం సమీపంలో నీటి ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహణ కల్పించారు. జలమండలి అధికారులు సిబ్బందితో కలిసి నీటి నిలువపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి మాట్లాడుతూ జల వనరుల సంరక్షణ, నీటి వనరుల ఉపయోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్గిఉండాలని పేర్కొన్నారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లోకి వచ్చేటట్లు చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శివరాం, సీఈఓ పి.విజయ్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ కె.వినోద్‌కుమార్, జలమండలీ అధికారులు కృష్ణప్రసాద్, నిఖిత, రజినితదితరులు పాల్గొన్నారు.

## కాపులు పార్టీలకు అతీతంగా రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలి

**భారత రాష్ట్ర సమితి ఆధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్.. కాపు భవన నిర్మాణానికి 20 లక్షల విరాళం**


పదిలక్షల చెక్కును సంఘం నేతలకు అందచేస్తున్న డాక్టర్ తోట చంద్రశేఖర్

ధర్నాచౌక్, మార్చి 31, ప్రభాతవార్త: కాపులు పార్టీలకు అతీతంగా రాజ్యాధికార సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని భారత రాష్ట్ర సమితి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని తెలగ, కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో కాపు భవన నిర్మాణ శంఖుస్థాపనకు ఆయన ఎంపీ డాక్టర్ కే.లక్ష్మణ్, కాంగ్రెసన సీనియర్ నేత వి.హనుమంతరావులతో కలసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యధిక శాతం ఉన్న కాపులు అన్ని రంగాలలో బలమైన శక్తిగా ఎదుగుతున్నారని తెలిపారు. తెలగ, కాపు, బలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం అవుతున్న కాపు భవనానికి తనవంతుగా 20 లక్షల విరాళం అందచేస్తానని ప్రకటించారు. అందులో భాగంగా పది లక్షల రూపాయల చెక్కును ఆయన సంఘం అధ్యక్షులు ఎర్రపోతు ప్రభాకర్‌రావుకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు, సంఘం నాయకులు అరవ రామకృష్ణ, ఏ.వీ.రత్నం, కోటేల శ్రీహరి, ముద్దుశెట్టి గోపాలకృష్ణ, తలారి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ధైర్యంగా బ్రతకడంతో పాటు, అన్ని రంగాల్లో ముందుడాలి

**ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి**


కార్యక్రమంలో పాల్గొన్న ఐద్వా రాష్ట్ర నేతలు మల్లులక్ష్మి, టి.జ్యోతి, వినయకుమార్ తదితరులు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: మహిళలు ధైర్యంగా బ్రతకడంతో పాటు, అన్ని రంగాల్లో ముందుడాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రానరష్ట కార్యదర్శి మల్లులక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.జ్యోతి అన్నారు. కుటుంబాల్ని ఎలా అయితే కాపాడుకుంటారో, సమాజాన్ని కాపావాల్సిన బాధ్యత మహిళలపై ఉందని భావించేవారు, వారి ఆశయాలకు అనుగుణంగా ఆత్మరక్షణ కోసం ఏర్పాటు చేసిన కరాటే శిక్షణ శిబిరం మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి తెలంగాణ సాయుధపోరాట యోధురాలు మల్లుస్వరాజ్యం, మోటూరి ఉదయం వర్ధంతి సందర్భంగా వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'కరాటే శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ సభ ట్రస్ట్ చైర్మన్ బుగ్గవీటి సరళ అధ్యక్షతన జరిగింది. మల్లులక్ష్మి మాట్లాడుతఊూ భవిష్యత్తులో ఆ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ట్రస్ట్, ఐద్వా పనిచేస్తాయన్నారు. సుందరయ్య విజ్ఞానకేంద్రం ట్రస్ట్ కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతఊూ వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఈ కేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కేంద్రాలు వీలయినంత ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ట్రస్ట్ కార్యదర్శి బి.హైమవతిమాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కేంద్రాలు నడుస్తున్నాయని, బాధిత మహిళలకు ఆశ్రయం ఇవ్వడం కోసం ట్రస్ట్ భవన్‌లో 'షార్ట్ స్టే హోం' ప్రారంభించామన్నారు. మహిళలు పనిచేస్తే తప్ప కుటుంబాలు గడవని నేపథ్యంలో ఆడపిల్లల విద్యపై తల్లుల కేంద్రీకరణ తగ్గుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి కెఎన్.ఆశాలత, ఐద్వా అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి, ట్రస్ట్ సభ్యుడు డి.ఇందర విశాలక్షి, ఇందిర ఉదయలక్ష్మి, శశికళ, లక్ష్మమ్మ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఐఎస్‌బి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**మారుతున్న సమాజానికి అనుగుణంగా వ్యాపారాలు ఉండాలి: నైకా సిఈఓ ఫాల్గునీ నాయర్**



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో గోల్డ్‌మోడల్‌ను అందుకుంటున్న ఐఎస్‌బి విద్యార్థి

గచ్చిబౌలి, మార్చి 31 ప్రభాతవార్త : ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బి) గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం గచ్చిబౌలిలోని ఐఎస్‌బి క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించారు. ఐఎస్‌బిలో పోస్టు గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజిమెంట్ (పిజిపి) పూర్తి చేసిన 574మంది, పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ మేనేజిమెంట్ ఫర్ సీనియర్ ఎక్జిక్యూటీవ్ (పిజిపిమ్యాక్స్) పూర్తి చేసిన 64మంది, డాక్టోరల్ ప్రోగ్రాం కింద ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజిమెంట్(ఎఫ్‌పిఎం) పూర్తి చేసిన 4గురు, ఎగ్జిక్యూటీవ్ ఫెలో ప్రోగ్రాం ఇన్ మేనేజిమెంట్(ఈఎఫ్‌పిఎం) పూర్తి చేసిన 8మంది పట్టాలు అందుకున్నారు. ఈ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇకాన్ష్ కట్టర్, శాశ్వత మజుందార్, సాయి అవినాష్‌లు ఐఎస్‌బి గోల్డ్ మెడల్స్‌ను అందుకున్నారు. గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన నైకా సిఈఓ ఫాల్గునీ నాయర్ మాట్లాడుతు మారుతున్న సమాజానికి అనుగుణంగా వ్యాపారాలు ప్రారంభించాలని ఐఎస్‌బి గ్రాడ్యుయేట్లకు సూచించారు. వినియోగదారుల విలువలను కాపాడుతుండడంతో పాటు నూతనంగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయోగాలకు పెద్దపీట వేయాలని, ఉత్తమ ఆవిష్కరణలు వ్యాపార సామ్రాజ్యాన్ని స ృష్టిస్తాయన్నారు. 20ఏళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన ఐఎస్‌బి ప్రపంచస్థాయి బిజినెస్ లీడర్లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌బి డీన్ మదన్ పిల్లుట్ల, బోర్డు చైర్మన్ హరీష్ మన్వానీ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదు: గోపాల క్రిష్ణదాస్


5వ వార్డు జూపిటర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు అధికారులు

కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే ఎంతటి వారినైనా సహించేది లేదని ఛీఫ్ ఇంజనీర్ గోపాల క్రిష్ణదాస్ హెచ్చరించారు. బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ అదేశాల మేరకు శుక్రవారం 5వ వార్డులోని జూపిటర్ కాలనీ, కాకగూడ, విక్రమ్‌పురి కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ భవనాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అనుమతులు తీసుకున్న ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అంతస్థుల మీద అంతస్థులు వేసుకుంటే వేసుకుంటే వారికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా కూల్చివేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు దినేశ్, జిష్ణు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ నగర్‌లో పోషణపక్షం ర్యాలీ


పోషణ పక్షం ర్యాలీలో పాల్గొన్న టీఎన్ శ్రీనివాస్

బేగంపేట మార్చి 31,ప్రభాతవార్త : బలవర్ధక మైన ఆహారాన్ని తీసుకుంటేనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని రసూల్ పురా ఇందిరమ్మ నగర్ వార్డు 2లో నిర్వహించిన పోషణపక్షం ర్యాలీలో శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కే సీ ఆర్ అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పోషకాలతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారని,దీని వల్ల చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న బలవర్ధకమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తుండటాన్ని ప్రజలకు వివరించేందుకు పోషణ పక్షం పేరుతో ర్యాలీలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు.ఈ ర్యాలీలో షేక్ నయీం, యాదగిరి బాలు సాగర్,రాజలింగం, ఉస్మాన్,జీవీ నాగమణి, అరుణ,స్రవంతి తార తిరుమల అంజమ్మ శాంత,యూసఫ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గౌడ మహిళా సంఘం సమావేశం


సమావేశంలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

చిక్కడపల్లి, మార్చి 31 ప్రభాతవార్త: తెలంగాణ గౌడ మహిళా సంఘం సమావేశం గడ్డమీది అనూరాధ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గౌని ప్రజ్వలగౌడ్, ఎం.అపర్ణగౌడ్, ఉపాధ్యక్షులు బాలగౌని నిర్మల గౌడ్, జయశ్రీగౌడ్, వేదగౌడ్, కోశాధికారి తీగుళ్ళ శోభాగౌడ్, సంయుక్త కార్యదర్శి రాజకుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమతగౌడ్, సంయుక్త కార్యదర్శి పద్మగౌడ్, విజయగౌడ్, గడ్డమీది పద్మగౌడ్, బీసీ కన్వీనర్ దీపికా, రాజేంద్రనగర్ బీసీ అధ్యక్షురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీ అంశంతో పాటు, శ్రీశైలం గౌడసత్రంలో జరిగిన అవకతవకలపై కెయి. కృష్ణమూర్తి, పల్లెల లక్ష్మణ్‌గౌడ్, చింతల మల్లేష్‌గౌడ్ తదితరులతో చర్చించి పరిష్కారం కనుగొనాలని తీర్మాణించింది.

## ఐఐటి హైదరాబాద్ అరుదైన ఘనత

**స్వదేశీ త్రిడీ ప్రింటింగ్‌తో ప్రోటోటైప్ బ్రిడ్జ్ రూపకల్పన**



హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త: ఐఐటి హైదరాబాద్ భారతదేశపు మొట్ట మొదటి ప్రోటోటైప్ 3డి ప్రింటెడ్ బ్రిడ్జిని అభివృద్ధి చేసింది. దీన్ని ఐఐటి హైదరాబాద్ సివిల్ ఇంజనీరింగ్ విభాగ ప్రెఫెసర్ కె.వి.ఎల్ సుబ్రమణ్యం ,పరిశోధన బృందం రూపకలప్పన చేశారు. పాదాచారుల కోసం రూపొందించిన ఈబ్రిడ్జ్ లోడ్ టెస్టింగ్ దశలో ఉంది. కాంక్రీట్, ఉపబల వినియోగాన్ని తగ్గించడానికి ఫారమ్ అప్టిమైజేషన్‌ను అనుసరించి ఐఐటి హైదారబాద్‌లో ఈవంతెనను తయారు చేశారు. "మెటీరియల్ ఫాలోస్ ఫోర్స్"అనే పద్ధతిని ఉపయోగించి ఈవంతెన రూపొందించారు. సింప్లిఫోర్జ్ క్రియేషన్స్ ఈప్రాజెక్ట్ కోసం ప్రత్యేకంగా ఎక్స్‌ట్రూషన్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసింది. ఈసందర్భంగా బ్రిడ్జి నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ 3డి కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ వాడకం ఊపందుకుందని తక్కువ వ్యవవధిలో నిర్మాణాలను పూర్తి చేయగల సామర్థ్యం 3డి కాంక్రీట్ టెక్నాలజీకి ఉందని తెలిపారు. నిర్మాణరంగంలో ఈటెక్నాలజీ అనూహ్య మార్పులు తీసుకొస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సిప్లిఫోర్జ్ డైరెక్టర్ హరికృష్ణ జీడిపల్లి, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నారు.


సీతారాముల రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర వ్యవసాయ కమిటిసభ్యులు డి.గోపాల్‌జీ,గోల్కొండ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి టి.ఉమామహేందర్,ప్రవీణ్

## పేదల ఇళ్లల్లో ఆడపిల్లల పెళ్లిళ్లకు కెసిఆర్ భరోసా

సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త: పేదల ఇళ్ళల్లో ఆడ పిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా సిఎం కెసిఆర్ భరోసా కల్పిస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన 75 మంది లబ్ధిదారులకు శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

## శ్రీహనుమాన్ శోభయాత్రకు ఆహ్వానం


ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న భగరంగ్‌దళ్ ప్రతినిధులు

దుండిగల్, మార్చి 31 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట భజరంగ్‌దళ్ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు,ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఏప్రిల్ 6న దుర్గమాత ఆలయం వద్ద ప్రారంభించనున్న శ్రీహనుమాన్ శోభయాత్రకు హాజరుకావాలని కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. స్పందించిన ఎమ్మెల్సీ హనుమాన్ శోభయాత్రను శాంతియుత వాతావరణంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఫాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**హిందువాహిని ఆధ్వర్యంలో..** హిందువాహిని కుత్బుల్లాపూర్ భాగ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6న జగద్గిరిగుట్ట సలాసర్ హనుమాన్ మందిరం వద్ద ప్రారంభమయ్యే హనుమాన్ శోభయాత్రకు హాజరుకావాలని కోరుతూ భాగ్ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వవిప్, మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో నరేష్, సంతోష్, రవి, శ్యామ్, చారీ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ


లబ్దిదారునికి చెక్కును అందజేస్తున్న కాలేరు వెంకటేష్

హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అశయమని ముఖ్యమంత్రి కెసిఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు అంబర్‌పేట నియోజకవర్గం నల్లకుంట డివిజన్‌కు చెందిన ఎస్.రాజమ్మ అభ్యర్ధనను పరిగణించి సిఎం సహాయ నిధి నుంచి 60 వేల రూపాయుల చెక్కును మంజూరు చేయడం జరిగింది. ఈ డబ్బును సద్వినియోగం చేసుకోవాలని కెసిఆర్ సూచించారు. ఈ చెక్కును శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆమె బంధువులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమ కోసం పాటు పడుతుందని చెప్పారు.

## ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు ఘన సన్మానం


ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌ను సత్కరిస్తున్న మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

నార్సింగి, మార్చి 31 ప్రభాతవార్త : ఆర్ఆర్ఆర్ సినిమా పాటల రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌ను శుక్రవారం మణికొండ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఘనంగా సత్కరించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు అంజన్ కుమార్‌గౌడ్, మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు బీరప్ప, కౌన్సిలర్ వందన నాగేష్, ఇందిరా, అనిత, రవికాంత్‌రెడ్డి, నరసయ్య, రాఘవరెడ్డి, వేణు కుమార్, ఒదేలు, ప్రతాప్‌రెడ్డి, ఆనందరావ్ తదితరులు చంద్రబోస్‌కు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అద్భుత పదాల మాంత్రికుడు, జనాల హృదయాలను ఆకట్టుకునేలా పాటలు రాసే నేర్పరి మన చంద్రబోస్ అని పేర్కొన్నారు. తన పాటతో దేశ ప్రజలతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రేక్షకులను అలరించారని గుర్తు చేశారు. చక్కనైన అమ్మభాషలో సకల జనులు మెచ్చుకునేలా పాటలు రాయడంలో బోస్ తనకు తానే సాటి,పోటీ అని కొనియాడారు. సినీ రంగంలో శ్రీశ్రీ,సినారేల స్థాయికి మన చంద్రబోసు చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

## పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్


సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న దక్షిణ మధ్య జిఎం అరుణ్ కుమార్ జైన్, కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామక్రిష్ణ

కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త: భారత ప్రధానీ నరేంద్ర మోడి ఈ నెల 8వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో చేపట్టనున్న భారత రైల్వేంటి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేయనున్న ససందర్భంగా శు క్రవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్, కంటోన్మెంట్ బోర్డు సివిల్ యన్ నామినేటెడ్ మెంబర్ ఉన్నతాధికారులతో కలిసి పరేడ్‌లో జరుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

## విద్యార్థులకు బహుమతులు ప్రదానం



చార్మినార్, మార్చి 31 ప్రభాతవార్త : పాతబస్తీ చార్‌కమాన్‌లోని అగర్వాల్ శిక్షా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న గణేష్ లాల్ కనోడియా ప్రైమరీ స్కూల్,లీలాభాయి మోతీలాల్ టోండేవాలే హైస్కూల్‌కు చెందిన బాల బాలికలకు శు క్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అగర్వాల్ శిక్షా సమితి ప్రతినిధులు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో అగర్వాల్ శిక్షా సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ కేడియో,ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ అగర్వాల్, కరస్పాండెంట్ మనీష్ అగర్వాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రీతిబాలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలి


ర్యాలీగా వెళ్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

గోషామహల్, మార్చి 31 ప్రభాతవార్త: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు తక్షణమే చట్టబద్ధత కల్పించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ మాదిగరిజర్వేషన్ పోరాట సమితి,మహజన సోషలిస్ట్ పార్టీ నాయకులు తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ,వివిఎస్ రాజు,సిహెచ్ సోమశేఖర్‌మాగి,పూజల్లో రవిమాదిగ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎంఆర్‌పిఎస్, ఎం.ఎస్.పి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వందరోజుల్లో వర్గీకరణ చేస్తామన్న బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చి దాదాపు 9సంవత్సరాలు అవుతున్నప్పటికి వర్గీకరణ చట్టబద్ధత కల్పించడంలేదన్నారు.ఈమహాధర్నా కార్యక్రమంలో జెపిలత,ఎ.సూరన్న,రామారావు,అరుణ్‌మాదిగ, మల్లికార్జున్,నరిసింహ,యాదన్న,జి.రాజశేఖర్,కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.


నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్


రాజేంద్రనగర్‌లోని పీరాన్‌చెరు గ్రేటెడ్ కమ్యూనిటీలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న గిరిధారి ఎగ్జిక్యూటివ్ పార్క్ అపార్ట్‌మెంట్‌వాసులు

## సైబరాబాద్ కమిషనరేట్‌కు శంకర్‌పల్లి సిఐ మహేష్‌గౌడ్ అటాచ్

(వార్తకు స్పందన)

-శంకర్‌పల్లి నూతన సిఐగా ప్రసన్నకుమార్ బాధ్యతలు
-పోలీసులు చట్టవ్యతిరేకంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవు
-సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరిక



శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్

**చేవెళ్ల, మార్చి 31, ప్రభాతవార్త :** శంకర్‌పల్లి సిఐపై వెల్లువెత్తుతున్న ఆరోపణలుపై ఆ..ఖాకీ..మహ ముదురు..అనే శీర్షికతో వార్త దిన పత్రిలో ఈనెల 31న శుక్రవారం ప్రచురితమైన కథనంకు సైబరాబాద్ కమీనర్ స్టీఫేన్ రవీంద్ర స్పందిచారు. విధులు నిర్లక్ష్యంగా నిర్వహించడంతో పాటు పలు అరోపణలు ఎదుర్కోంటున్న శంకర్‌పల్లి సిఐ మహేష్ గౌడ్‌ను సైబరాబాద్ కమీషనరేట్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు సైబరాబాద్ కమిషనర్ స్టీఫేన్ రవీంద్ర జారీ చేశారు.సైబరాబాద్ కమీషనేట్‌లోని సిపిఓ కార్యలయంలో శంకర్‌పల్లి సిఐ మహేష్‌గౌడ్ రిపోర్టు చేయాలని అదేశాలు జారీ చేశారు. మధపూర్ సిసిఎస్ కార్యాలయంలో సిఐగా పని చేస్తున్న ప్రసన్నకుమార్‌ను శంకర్‌పల్లి నూతన సిఐగా బదీలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.శంకర్‌పల్లి నూతన సిఐగా ప్రసన్నకుమార్ శుక్రవారం భాద్తతలు స్వీకరించారు. పోలీసులు ఏవరైన చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని సైబరాబాద్ కమీషనర్ స్టీఫేన్ రవీంద్ర హెచ్చ రించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన భాధితు లకు సరైన న్యాయం చేయాల్సి న బాధ్యత పోలీసులపై ఉందన్నారు. నిక్కచ్చిగా విధులు నిర్వహించాలని,పోలీసులు తమవిధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

### పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం



**ధారుర్ మార్చి31,ప్రభాతవార్త :** ధారుర్ మండలంలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ కుమార్ మాట్లాడుతూ...పదో పరగతి విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించి 100శాతం ఉత్తీర్ణత తీసుకురావాలని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

### రూ.90 కోట్లతో శంషాబాద్ మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం


బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు,అధికారులు

**శంషాబాద్ మార్చి31,ప్రభాతవార్త :** 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 97 కోట్ల రూపాయల అంచనాతో బడ్జెట్‌ను శంషాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశం ఆమోదించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి రాజేందర్ నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.అంచనాలతో రూపొందించిన ఈ బడ్జెట్లో 97 కోట్ల 23 లక్షల రూపాయలతో రూపొందించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ తెలిపారు.ఇందులో మున్సిపల్ జనరల్ ఫండ్ నుండి 20 కోట్ల 30 లక్షల రూపాయలు, హెచ్ఎండిఏ నిధుల నుండి 50కోట్ల రూపాయలు,టియుఎఫ్ఐడిసి ఫండ్ నుండి 20 కోట్ల రూపాయలు,ఎస్‌డిఎఫ్ నిధుల నుండి ఎమ్మెల్యే గ్రాంట్స్ కింద నాలుగు కోట్ల రూపాయలు ,పట్టణ ప్రగతి పథకం కింద మూడు కోట్ల రూపాయలు లభిస్తాయని తెలిపారు.ఈ నిధులతో పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వివరించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్లు ,కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్, చెన్నం అశోక్ ,జహంగీర్ ఖాన్,అజయ్,లావణ్య ,శ్రీనివాస్ గౌడ్,పేదిరిపాటి రాణి గౌడ్,స్రవంతి శ్రీకాంత్ రెడ్డి,కొనమోల్ల భారతమ్మ,శ్రీకాంత్ యాదవ్,బండి భాగ్యలక్ష్మి,రేఖ గణేష్ గుప్తా,తదితరులు పాల్గొన్నారు.

### తుంకిమెట్ల గ్రామంలో తైబజార్ వేలం


వేలం పాటలో పాల్గోన్న గ్రామ ప్రజలు

**బొంరాస్‌పేట్,మార్చి31,ప్రభాతవార్త :** తైబజార్ వేలంపాటను బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంలో శుక్రవారం నాడు గ్రామసర్పంచ్ స్వరూపనారాయణ గౌడ్,ఎంపిడిఓ పాండు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు.వారు మాట్లాడుతూ తుంకమెట్ల గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే కూరగాయల వారంతపు సంతకు వేలంపాట నిర్వహించడం జరిగిందన్నారు.ఈ వేలంపాటలో 20మంది పాల్గోనగా అందులో అత్యధికంగా 1లక్ష 50వేల రూపాయలకు అదే గ్రామానికి చెందిన మద్దూర్ రాజు గెలుచుకున్నరని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్,ఎంపిటిసి తిరుపతయ్య, ఉపసర్పంచ్ వెంకటయ్య,వార్డు సభ్యులు,యువకులు మల్లేష్‌గౌడ్, జలీల్,గ్రామప్రజలు పాల్గోన్నారు.

### తపస్ మండల నూతన కమిటీ ఎన్నిక

**బొంరాస్‌పేట్,మార్చి31,ప్రభాతవార్త :** తపస్ దౌల్తాబాద్ మండల నూతన కమిటీని తపస్ ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, బొంరాస్‌పేట్ మండల గౌరవ అధ్యక్షులు చంద్రశేఖర్ అధ్వర్యంలో శుక్రవారం నాడు సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కమిటీ ఎన్నికను నిర్వహించడం జరిగిందని వారు తెలిపారు.దౌల్తాబాద్ మండల గౌరవ అధ్యక్షులుగా నరసింహ,అధ్యక్షులుగా నాగేష్‌గౌడ్,మండల ప్రధాన కార్యదర్శిగా రాఘవేందర్,మహిళ ఉపాధ్యక్షులుగా శ్రీదేవి,కోశాధికారిగా కృష్ణరెడ్డి,నూతన కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎచ్ఎం ఊషన్న,జిల్లా ఉపాధ్యాక్షులు బాకారం మల్లయ్య, కొడంగల్ అధ్యక్షులు నారాయణ,కోస్గి అధ్యక్షులు అంజిలయ్య,దుద్యాల్ అధ్యక్షులు సిద్ధుమల్లేష్,గుండుమాల్ అధ్యక్షులు రవినాయక్,పాల్గొన్నారు.


నూతన ఎన్నికైన కమిటీ సభ్యులు

# బందోబస్తు మధ్య బల్దియా బడ్జెట్ సమావేశం

-ఇలా వచ్చి..అలా వెళ్ళిన చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లు..
-అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను ఏక గ్రీవంగా ఆమోదించాం..
-రూ.50.39 కోట్లు అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టిన చైర్‌పర్సన్ చిగుళ్ళపల్లి మంజుల

**వికారాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ మధ్యనే ఎమ్మెల్యే అసమ్మతి వర్గం ఏర్పాటు చేసుకున్న సమావేశంలో రచ్చ కావడంతో ముందస్తుగా పోలీసుశాఖ బందోబస్తు చర్యలు చేపట్టింది. చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల రెండున్నర సంవత్సరాల ఒప్పందం మేరకు చైర్మన్ కుర్చీ దిగకపోవడంతో..బడ్జెట్ సమావేశంలో ఏదైన గొడవ జరుగొచ్చని పోలీసు శాఖ భావించింది. కానీ..చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లు సమావేశానికి ఒక్కసారిగా హాజరై...బడ్జెట్ ఎజెండాను ఆమోదించి తిరిగి సమావేశం నుంచి వెళ్ళిపోయారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుర్లపల్లి మంజుల అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 2023-24 వార్షిక అంచనా బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య తిథిగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ హాజరయ్యారు. ఈ సమావేశానికి చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లను మాత్రమే మున్సిపల్ ఆవరణలోకి పోలీసులు అనుమతించారు. కౌన్సిలర్ కుటుంబ సభ్యులను కార్యాలయం లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో మహిళా కౌన్సిలర్లకు సంబంధించిన వారి కుటుంబ సభ్యులు మున్సిపల్ కార్యాలయ బయటనే సమావేశం జరిగినంత సేపు వేచి ఉన్నారు. మొదటగా చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రూ.50.30 కోట్ల అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టింది. సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్ ఎజెండాను ఆమోదించారు. ఆమోదం తెలిపిన వెంటనే చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లు సమావేశం నుంచి


మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

బయటికి వెళ్ళిపోయారు. దీంతో చైర్‌పర్సన్ అనుకూల వర్గం కౌన్సిలర్లు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు అంచనా బడ్జెట్‌పై చర్చించుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని కిందిస్థాయి వరకు చేరేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా కృషి చేయాలనిఅన్నారు. బడ్జెట్ సమావేశం అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల విలేకర్లతో మాట్లాడుతూ...మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కౌన్సిల్ సభ్యులు అందరూ ఏకగ్రీవ తీర్మానంతో 2023-24 సంవత్సరానికి గానురూ.50 కోట్ల 39 లక్షల 32వేల అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్ సభ్యులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ బడ్జెట్‌లో పన్నుల రూపంలో వచ్చేవి రూ.9.54 కోట్లు అంచనా వేయడం జరిగిందని తెలిపారు. నాన్ టాక్సెస్ రూ.9.75 కోట్లు, డిపాజిట్లు, లోన్‌ల రూపంలో వచ్చేవి రూ.90 లక్షలు, గ్రాంట్స్ రూ.30.20 కోట్లు రావచ్చునని అంచనా వేయడం జరిగిందని చైర్ పర్సన్ గారు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ శరత్ చంద్ర, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### -పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ ఎజెండాను ఆమోదించాం..

గతంలో చైర్‌పర్సన్ మంజుల అభివృద్ధిని అడ్డుకుంటున్నామని ఆరోపించారని, అందుకే పట్టణ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వార్షిక బడ్జెట్ ఎజెండాను ఆమోదించినట్లు చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లు లంక పుష్పలతారెడ్డి, జి.సునీత, ఎం.మంజుల, అనంత్‌రెడ్డి, గోపాల్, నవీన్‌కుమార్, క్రిష్టారెడ్డి లు తెలిపారు. చైర్మన్ కుర్చీ ఒప్పంద విషయం బహిరంగ సహస్యమేనని, వారు మాట తప్పిన పట్టణ ప్రజల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని తాము సమావేశానికి రావడం జరిగిందని చైర్‌పర్సన్ అసమ్మతి వర్గం కౌన్సిలర్లు మీడియాకు తెలిపారు.

# నేను మీ తాండూరు బిడ్డను ... మరో సారి ఆశీర్వదించండి

-ప్రజా సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..
-పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

**యాలాల మార్చి 31,ప్రభాతవార్త :** నేను మీ బిడ్డను...ప్రజా సమస్యల పరిష్కారమే నా ద్యేయం..అందుకే నేను రాజకీయాల్లోకి వచ్చాను... తాండూరు నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతా.....ఒక్క సారి ఆదరిస్తేనే ఇంతగా అభివృద్ధి చేశా...మరో సారి నన్ను గెలిపిస్తే అభివృద్ధి.సంక్షేమంలో తాండూరును రాష్ట్రంలో అగ్రగామిగా నిలిపేందుకు నా శయశక్తులా కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.రానున్న మూడు నెలల్లో గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలకు తీసిపోని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.సిఎం కెసిఆర్ సహాయ సహకరాలతో ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధికి గాను రూ.50 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గతంలో ఒక గ్రామానికి రూ.5లక్షలు రావడం అంటే మహా గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉండేదని,కానీ ఇప్పుడు ఒక్కో గ్రామానికి రూ.50 లక్షలు ఏక కాలంలో విడుదల కావడం హర్షనీయమన్నారు.శుక్రవారం యాలాల మండలంలోని బషీర్‌మియాతాండ,బామ్మానాయక్‌తాండ,కోకట్,రాఘవపూర్,విశ్వనాథ్‌పూర్,యాలాల,కమాల్‌పూర్,అఘాల్‌పూర్,భానాపూర్ తదితర గ్రామల్లో పల్లె పల్లెకు పైలెట్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అభివృద్ధి పనుల శంకు స్థాపన,ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం ఆయా గ్రామల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో పైలెట్ మాట్లాడుతూ ఎన్నికలు తగ్గర పడుతున్న క్రమంలో కాంగ్రెస్,బిజెపి నాయకులు గ్రామల్లో తిరుగుతూ సిఎం కెసిఆర్ తెలంగాణ ప్రభుత్వంపై విషం కక్కుతారని,వారి కల్లబొల్లి మాటలు నమ్మరాదని ఆయన సూచించారు.అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే రోల్డ్ మోడల్‌గా నిలిచిందని ఆయన తెలిపారు.ఆయా గ్రామల్లోని ప్రతి వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలను పర్యవేక్షించారు.ప్రజలు ఏకరువు పెట్టిన సమస్యలను ఎమ్మెల్యే ఓపికగా విని ప్రతి ఒక్కటీ పరిష్కరిస్తానని ప్రజల్లో భరోసా కల్పించారు. రూ.123కోట్ల నిధులతో తాండూరు నియోజక వర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి గ్రామాల రూపురేఖలు మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ వర్తించేలా తానే శ్రద్ధ చూపుతానని భరోసా ఇచ్చారు.గ్రామాల అభివృద్ధితో పాటు వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ అదకుంటానాని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యాలాల ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా,తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్,మండల పార్టీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి,సర్పంచులు మిత్రునాయక్,బస్వరాజ్,కోకట్ సర్పంచు ప్యాట హంసమ్మ శంకర్‌రెడ్డి,బాలీబాయి,లక్ష్మీదేవి,మధుసూధ్‌రెడ్డి,ఒంగోనిబాయి శ్రీనివాన్,ప్రవీణ్‌కుమార్,శ్రీనివాన్‌సాయమ్మ,యూత్‌వింగ్‌నాయకులు ప్రవీణ్‌కుమార్,మార్కెట్‌కమిటీ డైరెక్టర్ దేవనూర్ మెట్లి ఆశన్న,ఎంపిటిసి మంత్రి వెంకటయ్య ముదిరాజ్,ఎంపిటిసి సభ్యులు పగిడియాల్ రాములుప్రభాకర్, అమర్నాథ్‌రెడ్డి,కోటం రాంచంద్రారెడ్డి,ఎంపిటిసిలు,కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యఓలు అక్బర్‌బాబా,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, శ్రీనివాస్,రాములు అధికారులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


కోకట్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

# మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి లైన్ క్లియర్

- 3న మున్సిపల్ బడ్జెట్ సమావేశం
- ఎమ్మెల్యే చొరవతో సిడిఎంఏ ఉత్తర్వులు
- కార్మికుల వేతనాలు, పిఆర్‌సి బకాయిల చెల్లింపునకు మార్గం సుగమం

**తాండూరు, మార్చి 31, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపాల్టీలో వార్షిక బడ్జెట్‌కు సంబంధించి నెల కొన్న ప్రతిష్టంభన తొలగిపోయింది. గత ఏడిది కాలంగా వార్షిక బడ్జెట్ ఆమోదం లేకపోవడంతో తలెత్తిన ఇబ్బందులను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. తాండూరు మున్సిపాల్టీకి వార్షిక బడ్జెట్‌కు సంబంధించి వెంటనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని పురపాలక శాఖ డైరెక్టర్(సిడిఎంఏ) సత్యనారాయణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మెమో నెంబర్ 4254/ఎంఏ(1)/2023ద్వార పురపాలక శాఖ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఆర్థిక ఏడాది(2022-2023)తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరం(2023-2024)కు సంబంధించిన వార్షిక బడ్జెట్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ మెమో మేరకు వెంటనే తాండూరు మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశాలను ఏర్పాటు చేయాలని పేర్కొంటూ ఉత్తర్వులు 542234/2023 జారీ చేశారు. జిల్లా కలెక్టర్, తాండూరు మున్సిపల్ కమిషనర్ వెంటనే బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందకు చర్యలు చేపట్టాలని సూచించారు. డిసిఎంఏ ఆదేశాలతో ఏప్రిల్ 3న మున్సిపల్ బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో గత ఏడది బడ్జెట్‌తో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఆమోదంకు ఏప్రిల్ 3న ప్రత్యేక సమావేశంను నిర్వహించనున్నారు.

వార్షిక బడ్జెట్ ఆమోదం తరువాత కార్మికుల వేతనాల చెల్లింపు, పిఆర్‌సి బకాయిల చెల్లింపు, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, ట్రాక్టర్ల మరమ్మత్తులకు నిధులు, వీధి దీపాలకు నిధులు చేతి పంపుల మరమ్మత్తులకు నిధులు అందుబాటులో ఉంటాయి.

### బాల్య వివాహలను రూపుమాపేందుకు కృషి చేయాలి

-డిప్యూటి తహసిల్దార్ మహేష్


మాట్లాడుతున్న డీటీ మహేష్

**పెద్దేముల్, మార్చి 31, ప్రభాతవార్త:** బాల్య వివాహలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని డిప్యూటి తహసిల్దార్ మహేష్ అన్నారు.డిప్యూటి తహసిల్దార్ మహేష్ అధ్యక్షతన,1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి నర్సిములు గౌడ్ అధ్వర్యంలో శుక్రవారం పెద్దేముల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మహేష్ మాట్లాడుతూ బాల్య వివాహల నిర్మూలన,బాల కార్మీక వ్యవస్థ, బడిబయట ఉన్న పిల్లలను బడికి పంపించడం, వేధింపులు తదితర విషయాలను అరికట్టడానికి ప్రజాప్రతినిధులు,పంచాయతీ కార్యదర్శులు,అంగన్‌వాడి టీచర్లు, ఆశా వర్కర్లు,పంచాయతీ కార్మీకులు, విఆర్ఏలు చొరవ చూపాలని అన్నారు. కిషోరా బాలికలు ఏయే తరగతి చదువు తున్నారో తెలుసుకొని, ఎవరైన బాల్య వివాహలు చేస్తున్నారని సమాచారం అందితే వీసీపిసి టీం ద్వారా వారి ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహల రహిత మండలంగా పెద్దేముల్ మండలంను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. చైల్డ్ లైన్ ప్రతినిధి నర్సిములు గౌడ్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 62 కేసులు వచ్చాయని, అందులో బాల్య వివాహలు, వేధింపులు, డ్రాపౌట్, బాల కార్మీకులుగా ఉన్నారని, వీరి నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో యంపిడిఓ లక్ష్మయ్య, యంపిఓ సుష్మ,ఆర్ఐ రాజురెడ్డి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, సంగమేశ్వర్ వార్డెన్, ఏపిఓ లక్ష్మి, అంగన్‌వాడి సూపర్‌వైజర్లు రాణి, మీనాక్షి,చైల్డ్‌లైన్ ప్రతినిధి హన్మంతు రెడ్డి,యంఆర్‌సి క్రిష్ణ, సీసీలు సత్యనారాయణ, జే.లక్ష్మన్ పాల్గొన్నారు.

### బిజెపి ప్రభుత్వం బడా వ్యాపార సంస్థలకు వత్తాసు పలుకుతుంది

-రాహూల్ గాంధీపై మోడీ సర్కార్ కక్ష్య సాధింపులకు పాల్పడుతుంది
- జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి

**చేవెళ్ల, మార్చి 31, ప్రభాతవార్త** బిజెపి ప్రభుత్వం దేశంలోని బడా వ్యాపారస్తులకు వత్తాసు పలుకుతూ దేశ సంపదను దోచి పెడుతుందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి విమర్శించారు.శుక్రవారం గాందీభవన్‌లోని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహరెడ్డి మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహూల్ గాంధీని బిజెపి ప్రభుత్వం కుట్ర పూరితంగా ఎంపి పదవికి అనర్హత వేటు చేసిందన్నారు. బిజెపి ప్రభుత్వం తీరుపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేయాలన్నారు. మోడీ స్నేహితులైన అదాని కంపనీకి 20,000 కోట్ల రూపాయలు ఏలా వేల్లాయన్నారు. మోడీ పాలనను పార్లమెంట్‌లో నిలదీసినందుకు రాహుల్ గాంధీపై అక్రమ కేసులు నమోదు చేసి ప్రతిపక్ష నాయకులను అనచివెస్తున్నారన్నారు.ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు, జర్నలిస్టులపై ఈడీ, సిబిఐ తప్పుడు కెసులు దాడులు చేపట్టి భయబ్రాంతులకు గురిచేస్తుందన్నారు.గతంలో బ్రిటిస్ ప్రభుత్వం మహాత్మాగాంధీ,పండిత్ జవహర్‌లాల్‌నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లాబాయ్ పటేల్, మౌలానా అజాద్‌లను దేశద్రోహం కింద జైలు శిక్షలను విదించారని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య విజయం సాధించిందని, ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం మోడీ పిఎంగా భాద్యతలు తీసుకున్న తరువాత రాహూల్ గాంధీపై తప్పుడు కేసులు నమోదు చేయడం జరుగుతుందని,కాని చివరికి కాంగ్రెస్ పార్టీ విజయలం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రేస్ పార్టీ అధికార ప్రతినిధి సంకేపల్లి సుదీర్‌రెడ్డి,పిసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, ఎల్‌బినగర్ నియోజవర్గం ఇంచార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం సమన్వయ కమిటీ చైర్మన్ సత్య నారాయణరెడ్డి తదితరులు పాల్గోన్నారు.

### రైతుల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి : చెర్మన్ మనోహర్‌రెడ్డి

**కుల్కచర్ల,మార్చి 31ప్రభాతవార్త** ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం రైతన్నల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చెర్మెన్ బయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు.శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం కులకచ్చర్ల మండల కేంద్రంలో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం డిసిసిబీ చెర్మేన్ మనోహర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం రైతు సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని గతంలో ఎన్నడూ లేని విధంగా కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అనేక మందికి రూ.1కోటి వరకు రుణాలు అందించడం జరిగిందన్నారు.ఇప్పటివరకు బంగారంపై 1663 మందికి రూ.11కోట్ల60లక్షలు, స్వల్పకాలిక రరుణాలు 1332 మందికి గాను రూ.1కోటి61లక్షలు,ధీర్ఘకాలిక రుణాలు 789 మందికిగాను రూ.24కోట్ల26లక్షలు,సేవింగ్ అకౌంట్స్‌లో 914 మందికి రూ.20లక్షల96వేలు,ఫిక్స్‌డ్ డిపాజిట్ 164 మందికి రూ.39లక్షల 56వేలు,స్వయం ఉపాధి కోసం 65 మందికి రూ.18లక్షల50వేల రుణాలు అందించినట్లు తెలిపారు.ఇప్పటివరకు సభయల వాటాధనం రూ.2కోట్ల80లక్షలు పీఏసీఎస్ ద్వారా లబ్ది పొందారని గుర్తు చేశారు.మరో రూ.500 కోట్ల రుణాలు అదనంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెర్మేన్ పేర్కొన్నారు. రైతులతో పాటు చిరు వ్యాపారులకు కూడ రుణాలు అంజేయడం జరుగుతుందని వెల్లడించారు.రైతుల సహకారంతో ధాన్యం నిల్వల గిడ్డంగులు,రైస్ మిల్లు ఏర్పాటు చేశామన్నారు.పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేకంగా రుణాలు అందజేయనున్నట్లు స్పష్టం చేశారు.పీఏసీఎస్‌లో సభ్యత్వం ఉన్న రైతులు మరణిస్తే తక్షణ సహాయం కింద రూ.9వేలు అందజేస్తున్నామన్నారు.జిల్లాలోనే మెట్టమొదటి సారిగా అన్‌లైన్ సిస్టం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు.పీఏసీఎస్‌లో ఉన్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామని తెలిపారు.పీఏసీఎస్‌లో శాశ్విత సభ్యత్వం ఉన్న రైతులకు చిరు కానుకగా గోడ గడియారాలను అందజేశారు.కార్యక్రమంలో ఎంపీపీ సత్యహర్షిందర్,జడ్పీటీసీ రాందాస్‌నాయక్,పీఏసీఎస్ వైస్‌చెర్మేన్ నాగరాజుయాదవ్,స్థానిక సర్పంచ్ సౌమ్య వెంకట్రామిరెడ్డి,చౌడాపూర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు,మాజీ మార్కెట్ కమిటీ చెర్మేన్ సత్తినేని సుధాకర్‌రెడ్డి,గందె రాజప్ప,మాలె,క్రిష్ణయ్యగౌడ్,మొగులయ్య,పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి,ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు రాంలాల్,జోగు వెంకటయ్యగౌడ్, తులసీరాం,పీఏసీఎస్ డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెర్మన్ మనోహర్‌రెడ్డి

### సారా తయారు చేసిన, విక్రయించినా చర్యలు తప్పవు

-తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి


తహసిల్దార్ ముందు బైండోవర్ చేస్తున్న దృశ్యం

**పెద్దేముల్, మార్చి 31, ప్రభాతవార్త:** సారా తయారు చేసిన, విక్రయించిన చర్యలు తప్పవని తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి హెచ్చరించారు. ఎక్సైజ్ ఎస్ఐ చంద్రకాంత్ నేతృత్వంలో కానిస్టేబుల్లు రమేష్, భీమయ్య, రాజేందర్‌లు దాడులు నిర్వహించగా పెద్దేముల్ మండలంలోని పాషపూర్ గ్రామానికి చెందిన లక్ష్మన్, చవాన్ అశోక్,కమిలిబాయి, రవి,తట్టేపల్లికి చెందిన రామ్‌జీ వద్ద సారా, బెల్లం ఊట లభించాయి. ఈ మేరకు శుక్రవారం వారిని ఎక్సైజ్ కానిస్టేబుల్లు భీమయ్య, మహేష్‌లు తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి ముందు బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ సారా తయారుచేసిన, విక్రయించిన కేసునమోదు చేసి జరిమానాతో పాటు జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

### పెద్దేముల్‌లో తైబజార్, వాటర్ ఫిల్టర్ వేలం


పంచాయతీ ఆవరణంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

**పెద్దేముల్, మార్చి 31, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ద్యావరి విజయమ్మ అధ్వర్యంలో శుక్రవారం తైబజార్, వాటర్ పిల్టర్ వేలం పాట నిర్వహించారు. తై బజార్ వేలంలో 5 గురు పాల్గొనగా పడగల్ల రాములు రూ.78,500లకు దక్కించుకున్నారు. వాటర్ ఫిల్టర్ వేలంలో 15 మంది పాల్గొనగా బోయిని వెంకటయ్య రూ.1,17,100లకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ద్యావరి విజయమ్మ మాట్లాడుతూ వేలంలో కైవసం చేసుకున్న సభ్యులు రెండు దపాలుగా డబ్బులు చెల్లించాలని అన్నారు. తై బజార్ టోకెన్ రూ.15, వాటర్ ప్లాంట్ వద్ద రూ.7, ఇంటి వద్ద వేసే బాటిల్‌కు రూ.15 చొప్పున చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ గౌడ్, పంచాయతీ సభ్యులు డిపై అరవింద్, ఫయాజ్, మల్లేశం, బాలమణి,సత్తార్, కారోబార్ నర్సిరెడ్డి, గ్రామస్థులు యాదయ్య, అశోక్, శ్రీనివాస్, వెంకట్, రాజు, ప్రభు, బిచ్చయ్య, బాల్‌రాజ్, రంగయ్య,సాయిలు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

### టిఎస్‌పిఎస్‌సి కమిటీని రద్దు చేయాలి

- నూతన కమిటీని ఏర్పాటు చేయాలని బీఎస్పీ ఆందోళన



దీక్షలో పాల్గొన్న బిఎస్పీ నాయకులు

**శంషాబాద్ మార్చి31,ప్రభాతవార్త :** టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులందరికి నూతన కమిటీ ఏర్పాటు చేసిన తర్వాతనే గ్రూప్ వన్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు రాచమల్ల జయసింహ ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.లింగం మాట్లాడుతూ...ప్రస్తుతం చైర్మన్‌గా ఉన్న జనార్ధన్ రెడ్డిని సభ్యులను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని యుద్ధ ప్రాతిపదికన వీరిపై చర్యలు తీసుకొని నూతన కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.నూతన కమిటీ ఏర్పాటు చేసిన తర్వాతనే గ్రూప్ వన్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేయాలని రాచమల్ల జయసింహ డిమాండ్ చేశారు.బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి నిరుద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి విజయ్ ఆర్య మహేష్ ,మల్లేష్, రాజు,మహేంద్ర వర్మ,సాయికృష్ణ,ప్రవీణ్ కుమార్,సత్యనారాయణ,పాల్గొన్నారు.

### అనారోగ్యంతో అప్పరెడ్డి గూడ రేషన్ డీలర్ మృతి

**మొయినాబాద్, మార్చి 31, ప్రభాతవార్త :** అనారోగ్యంతో ఓ రేషన్ డీలర్ మృత్తి చెందాడు, మొయినాబాద్ మండలంలోని అప్పరెడ్డి గూడ గ్రామానికి చెందిన కావలి నరసింహులు (55) అనారోగ్యం కారణంగా నగరంలోని ఒ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతు మరణించాడు, చికిత్స నిమిత్తం దాదాపు 20 లక్షల రూపాయలు కర్చుచేసినా దేవుడు కరణించలేదు, నర్సింహులు బ్రతకలేదు, కరోనాతో నర్సింహులు భార్య మృతి చెందింది, వారికి సంతానంగా ముగ్గురు పిల్లలు ఉన్నారు, ఎవరికి ఇంకా వివాహం కాలేదు, కోవిడ్‌తో భార్య మరణం, తండ్రి అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండి లక్షలు కర్చుచేసినా ప్రయోజనం లేకుండా పోయింది, దినితో వారి కుటుంబం అప్పుల కుప్పగా మారింది, తల్లి, దండ్రులు లేకపోవడంతో పిల్లలు గూడుచెదిరిన పక్షుల మిగిలిపోయారు, ఏ దిక్కులేక అనాథల్లా వారు మిగిలిపోయారు, తల్లి,దండ్రులు లేకుండా వారిని చూసి గ్రామస్తులంతా అయ్యోపాపం అంటు కనీరు మున్నీరయ్యారు, వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, గ్రామస్తులు, వారి బంధువులు ప్రభుత్వానికి విజ్ఞాప్తి చేస్తున్నారు, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు, ప్రభుత్వం ఏ విధంగా నైనా వారికి అండగా ఉండాలని కోరుతున్నారు.